సాక్షి
మెదక్
శుక్రవారం ꠰ 28 ꠰ జూలై ꠰ 2023

ముంచెత్తిన వాన



ఏడుపాయల ఆలయం ఎదుట మంజీరా పరవళ్లు

జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం
- కలంగూర్ డ్యాం నుంచి నీటి విడుదల
- ఉప్పొంగిన మంజీరా, పోచారం ప్రాజెక్టులు
- ఏడుపాయల ఆలయం మూసివేత

మెదక్: రెండు రోజులుగా జిల్లాలో ముసురుతో కూడిన వర్షం పడడంతో మండలాలు, గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి. వాగులు పొంగి పలు చోట్ల రోడ్లు, వంతెనల పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అంతర్గత రోడ్లలో లోలెవల్ వంతెనల వద్ద వరద నీరు ఉధృతంగా వెళుతుండడంతో వాహనాలు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు పెట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధి ఐదో వార్డులో బృందావన కాలనీ జలమయమైంది. వర్షాలకు పట్టణంలో మట్టిగోడలు, పెంకుటిళ్లు కూలిపోయాయి. మిలటరీ కాలనీలోని మహ్మద్ సర్వర్‌కు చెందిన ఇల్లు కూలింది. లోతట్టు ప్రాంతాల ఇళ్లల్లో వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రాకపోకలకు అంతరాయం..

సింగూర్ ప్రాజెక్టు నుంచి నీరు పెద్ద ఎత్తున దిగువకు వస్తుండటంతో కలంగూర్ డ్యాంకు నుంచి 6వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదిలారు. ఘణపురం ప్రాజెక్టులోకి నీరు చేరడంతో ఏడుపాయల ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మంజీరా నది పరిసరాలకు వెళ్లొద్దని అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. రాయినిపల్లి ప్రాజెక్టు వరద నీటితో పొంగి పొర్లుతుంది. కామారెడ్డి-నిజామాబాద్ జిల్లాల సరిహద్దు పోచారం ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. హవేళీఘనాపూర్ మండలం దూప్‌సింగ్ తండా వాగు వరద నీటితో ప్రవహిస్తోంది. తూప్రాన్ మండలం హల్దీవాగు ఉధృతితో కిష్టాపూర్, వెంకటాయిపల్లి, నర్సంపల్లి గ్రామాలకు, నిజాంపేట మండల కేంద్రం చల్మెడ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొల్చారం మండలం జానకంపల్లి కొంగోడు మధ్య బ్రిడ్జి పైనుంచి నీరు వెళుతుండడంతో పోలీసులు రోడ్డును మూసివేశారు. ఎనగండ్లలో దామరచెరువు అలుగుకు గండికొట్టి నీటిని కిందకు వదిలారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాజిపేట, జాజితండాల రోడ్లను మూసివేశారు. కొల్చారంలో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. సంఘయ్యపేట పెద్ద చెరువును గురువారం ఇరిగేషన్ శాఖ డీఈ జగన్నాథం, ఏఈ మహేష్ కుమార్ పరిశీలించారు. వనదుర్గ ప్రాజెక్టు పొంగి పొర్లుతుండడంతో కొంగోడు వద్ద రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది. అటువైపు ఎవరూ వెళ్లకుండా ఎంపీడీఓ గణేష్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీరాజ్ ఏఈ ఇర్ఫాన్, ఎంపీఓ కృష్ణవేణి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

గడిచిన 24గంటల్లో వర్షపాతం..

మాసాయిపేట మండలంలో అత్యధికంగా 67.8 మి.మీటర్లు, చేగుంట మండలంలో 62.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. చిన్నశంకరంపేటలో 56.5 మి.మీ, మనోహరాబాద్ 53.3, వెల్దుర్తిలో 51.9, నర్సాపూర్‌లో 37.4, కొల్చారంలో 36.5, పెద్ద శంకరంపేటలో 34.5, నార్సింగ్‌లో 33.5, శివ్వంపేటలో 32.9, హవేళిఘనాపూర్‌లో 30.9, రామాయంపేట, కౌడిపల్లి మండలాల్లో 29.5, రేగోడ్, అల్లాదుర్గం మండలాల్లో 27.5, చిలప్‌చెడ్‌లో 20.0, తూప్రాన్‌లో 16.5, పాపన్నపేట 15.8, టేక్మాల్ 14.9, నిజాంపేట 1.8 మి.మీటర్ల చొప్పున వర్షపాతం నమోదు కాగా, ఓవరాల్‌గా 34.9 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



పొంగుతున్న పోచారం ప్రాజెక్టు



సంగాయిపేట వద్ద వరి చేనులో ఇసుక మేట



వనదుర్గ ప్రాజెక్టు వద్ద పోలీసుల బందోబస్తు

న్యూస్‌రీల్

చౌటపల్లి బ్రిడ్జి పరిశీలన



బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

హవేళీఘనపూర్: మండలంలోని చౌటపల్లి రోడ్డులో బ్రిడ్జిని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రజలకు సూచించారు. పాత ఇళ్లల్లో ఉండొద్దని, కరెంట్ వైర్లు, స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మేకల సాయిలు, రాంచంద్రారెడ్డి, రమేశ్ ఉన్నారు.

ఏడుపాయల ఆలయం మూసివేత



ఆలయానికి తాళం వేస్తున్న పూజారులు, అధికారులు

పాపన్నపేట(మెదక్): వీడని వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. సింగూర్ నుంచి 6 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో మంజీరా పరుగులు తీసి ఘణపురం ఆనకట్టపై నుంచి ప్రవహిస్తూ వనదుర్గమ్మ ఆలయాన్ని చుట్టుముట్టింది. దీంతో అర్చకులు ఆలయాన్ని మూసివేసి రాజగోపురంలో పూజలు నిర్వహించారు. ఆలయం వైపు వెళ్లకుండా స్టాపర్లను ఏర్పాటు చేశారు.


సోలార్ ట్రాప్‌లైట్స్ పంపిణీ



సోలార్ ట్రాప్‌లైట్స్ అందుకున్న రైతులతో కేవీకే శాస్త్రవేత్తలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో గురువారం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ రైతులకు సోలార్ ట్రాప్‌లైట్స్, లింగాకర్షక బుట్టలు, జీవన ఎరువులు, పసుపు, జిగురు అట్టలను పంపిణీ చేశారు. అనంతరం కేవీకే హెడ్, సైంటిస్ట్ సంబాజీ దత్తాత్రేయ నల్కర్ మాట్లాడుతూ.. సేంద్రియ సాగు ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. లింగాకర్షక బుట్టలతో కీటకాల దాడిని అరికట్టవచ్చని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర బీజేపీ ఓబీసీ యువ మోర్చ అధ్యక్షుడు భాస్కర్, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్, రవికుమార్, ఉదయ్ కుమార్, డాక్టర్ భార్గవి, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్ రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

మెదక్ డీఎస్పీగా ఫణీందర్



ఎస్పీకి పూలమొక్క అందిస్తున్న డీఎస్పీ ఫణీందర్

మెదక్‌మున్సిపాలిటీ: మెదక్ డీఎస్పీగా ఫణీందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సిద్దిపేట జిల్లా ట్రాఫిక్ ఏసీపీగా పనిచేసిన ఫణీందర్ బదిలీపై మెదక్ డీఎస్పీగా వచ్చారు. ఇక్కడ పని చేసిన డీఎస్పీ సైదులు హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేశారు.

మంజీరా పరిసరాలకు వెళ్లొద్దు



చిట్కుల్ వంతెన వద్ద పోలీసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): సింగూర్ డ్యాం నుంచి నీటి విడుదల చేయడంతో మంజీరా వాగు ఉధృతంగా ప్రవహిస్తోందని ఎస్ఐ మహ్మద్‌గౌస్ తెలిపారు. గురువారం సిబ్బందితో కలసి చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ చాముండేశ్వరీ పరిసరాల్లో వంతెన వద్దకు ఎవరూ వెళ్లకుండా బారికేడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంజీరా వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగే ప్రయత్నాలు చేయొద్దని, వరద ఉధృతి తగ్గేవరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. వరద తీవ్రత తగ్గేవరకు బ్రిడ్జి పరిసర ప్రాంతాలకు రావొద్దని ఆదేశించారు.

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వద్దు

అదనపు కలెక్టర్ రమేశ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

నర్సాపూర్: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం చేయొద్దని అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులకు ఆదేశించారు. గురువారం మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నుంచి ప్రజలను ఖాళీ చేయించాలని, అత్యవసర సేవల కోసం రెస్క్యూ టీం 24గంటలు అందుబాటులో ఉంచాలన్నారు. బస్తీ దవాఖానా నిర్మాణ పనుల ఆలస్యంపై కౌన్సిలర్ అశోక్‌గౌడ్, పట్టణంలో మినీ స్టేడియం ఆలస్యంపై కౌన్సిలర్ యాదగిరి ప్రశ్నించారు. స్పందించిన అదనపు కలెక్టర్ రమేశ్ ఈ అంశంపై సంబంధిత శాఖకు లేఖ రాయాలని కమిషనర్ వెంకటగోపాల్‌కు సూచించారు. పోస్ట్ ఆఫీస్ సమీపంలో షెడ్డు నిర్మిస్తే వినియోగదారులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. పట్టణంలోని ఒక్కో వార్డుకు ఏడున్నర లక్షల రూపాయలు కేటాయించినా పనులు ప్రారంభించలేదని కౌన్సిలర్లు యాదగిరి, రాజేందర్, సురేష్, బుచ్చేష్‌యాదవ్‌లు సభ దృష్టికి తీసుకురాగా, పనులు టెండరు దశలో ఉన్నాయని, పూర్తి కాగానే చేపడుతామని పీఆర్ ఏఈ స్వామిదాస్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్ పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ రమేశ్, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌తో కలిసి పట్టణంలో అలుగుపారుతున్న రాయరావు చెరువును పరిశీలించారు.

అండర్ బ్రిడ్జి పరిశీలన

మనోహరాబాద్(తూప్రాన్): వర్షాలకు కురుస్తున్నందున రోడ్డుపై నిలిచే నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అదనపు కలెక్టర్ రమేశ్ అన్నారు. మండలంలోని రామాయపల్లి జాతీయ రహదారి-44పై రైల్వే అండర్ బ్రిడ్జిని గురువారం పరిశీలించి, జీఎమ్మార్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.



నాయక్‌చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

కంట్రోల్ రూం సేవలు వినియోగించుకోవాలి

కలెక్టర్ రాజర్షిషా

హవేళీఘనపూర్: వాతావరణ శాఖ సూచన మేరకు రానున్న 24గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం మెదక్ మండలం అవుసులపల్లి శివారులో మెదక్-రామాయంపేట హైవే రోడ్డు, నాయక్‌చెరువు ఉధృతిని పరిశీలించారు. వర్షాలు, వరదలకు సంబంధించి 93919 42254కు ఫోన్ చేయాలని, విద్యుత్ సంబంధిత సమస్యలకు 79016 77782 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జానకీరామ్‌సాగర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వెల్దుర్తి(తూప్రాన్): పర్యావరణం, రోడ్లు, పంట పొలాలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాకే క్రషర్‌కు అనుమతులు మంజూరు చేస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మాసాయిపేట మండలం రామంతాపూర్ శివారు సర్వే నంబర్ 389/1లో ఏర్పాటు చేయనున్న స్టోన్ క్రషర్‌కు సంబంధించి గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కుమార్, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇప్పటికే ఉన్న క్రషర్ల నిర్వాహకులు ఎలాంటి జాగ్రత్తలు పాటించడంలేదని, ఇష్టారీతిన పేలుళ్లు జరపడంతో గతంలో మూగజీవాలు మృత్యువాతపడ్డాయని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్, ఎస్పీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, యువకులు తెలిపారు. మూడో క్రషర్ ఏర్పాటుకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ నిబంధనలు పాటించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అన్ని చర్యలు తీసుకున్నాకే అనుమతులు ఇస్తామని, క్రషర్ ఏర్పాటుకు సంబంధించి ఇంకా ఎవరికైనా అభ్యంతరాలుంటే కలెక్టర్ కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు.

పాత ఇళ్లల్లో ఉండొద్దు

భారీ వర్షాలు కురుస్తున్నందున పాత, శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉండొద్దని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 155 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, రెండు, మూడు చెరువులకు గండ్లు పడ్డాయన్నారు. వాయుగుండం తీవ్రత కారణంగా శుక్ర వారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. ఫొటోలు దిగేందుకు హల్దీ ప్రాజెక్ట్, చెరువులు, కుంటల వద్దకు వెళ్లొద్దన్నారు.

గిరిజనుల ఆందోళన



తండావాసులతో మాట్లాడుతున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సితారం తండాలో పాత ఇండ్లలో ఉంటున్నవారిని ఖాళీ చేయించేందుకు ప్రయత్నించగా తండా వాసులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. రత్నపూర్ పరిధిలోని కోమటి చెరువు నిండడంతో వరద ఉధృతికి ఓ ఇల్లు కూలిపోయింది. స్పందించిన నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాసులు, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీడీఓ నవీన్‌కుమార్ శిథిలావస్థలో ఉన్న 20 ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించేందుకు తండాకు వెళ్లారు. ఈ సందర్భంగా తండావాసులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గతంలో కూలిన ఇండ్లకు పరిహారం ఇవ్వలేదని, తాగేందుకు భగీరథ నీరు రాకపోవడంతో వ్యవసాయ బోరుబావుల నుంచి నీరు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఆర్డీఓ శ్రీనివాసులు హామీ ఇవ్వడంతో తండా వాసులు శాంతించారు. తండి నుంచి పలు కుటుంబాలను ఖాళీ చేయించి ప్రాథమిక పాఠశాల ఉంచారు. మరికొందరు వారి బంధువుల ఇండ్లలో పునరావాసం పొందారు.



వర్షంలో గొడుగులు పట్టుకుని నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

పింఛన్ తిప్పలు

నర్సాపూర్: పింఛన్ పైసల కోసం వృద్ధులు, లబ్ధిదారులు పోస్టాఫీస్ వద్ద వర్షంలోనే నిరీక్షించారు. ఈ ఘటన నర్సాపూర్ మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. మున్సిపల్ పరిధిలో అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు గురువారం పింఛన్ తీసుకునేందుకు వర్షాన్ని లెక్కచేయకుండా పట్టణంలోని పోస్టాఫీస్ వద్దకు వచ్చారు. అక్కడ నీడ సదుపాయం లేకపోవడంతో రోడ్డుపై గొడుగులు పట్టుకుని గంటలకొద్దీ నిరీక్షించారు. ఈ విషయమై సబ్ పోస్ట్ మాస్టర్ హరిప్రసాద్‌ను వివరణ కోరగా.. ఇంటర్నెట్ సమస్య, మిషన్లు సరిగా పని చేయకపోవడంతో పంపిణీ ప్రక్రియ మెల్లగా కొనసాగినట్లు తెలిపారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్: ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సమస్యలను పరిష్కరించటంతో పాటు సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంతి నరేందర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చాలా కాలంగా ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు రాకపోవడం, సరెండర్ లీవ్, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు, పిల్లల పెళ్లిళ్లకు దరఖాస్తు చేసుకున్న జీపీఎఫ్ డబ్బులు అందక ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ ఉద్యోగులు అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యల పరిష్కార నిమిత్తం నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీఓ నంబర్ 79 విడుదల చేసిన క్రమంలో కలెక్టర్ యుద్ధ ప్రతిపాదికన కారుణ్య నియామకాలు చేపట్టి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. జూలై 1వ తేదీ నుంచి పీఆర్సీని అమలు చేసి బెనిఫిట్స్ ఇవ్వాలని, ఇప్పటికే ఉద్యోగులు రెండు పీఆర్సీలు నష్టపోయారని పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో న్యాయం జరిగేలా చూడాలని, ప్రభుత్వ ఉద్యోగుల భాగస్వామ్యంతో నగదు రహిత వైద్యం అందించే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పలు సమస్యలపై జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ తీర్మానాలు ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనిచో శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ, జిల్లా కోశాధికారి బట్టి రమేష్, ఉపాధ్యక్షులు మంగ మనోహర్, ఎండీ ఇక్బాల్ బాషా, ఎం.కే.టీ అర్షద్, ఎండీ. ఫజలుద్దీన్, సంయుక్త కార్యదర్శి రాధా, కార్యనిర్వాహక కార్యదర్శి చిరంజీవ ఆచారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్

కదంతొక్కిన పంచాయతీ కార్మికులు

సీఐటీయూ నాయకులతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

మెదక్ కలెక్టరేట్: సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, కారోబార్, బిల్ కలెక్టర్లను నియమించాలన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల సాయం అందించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్, ఉపాధ్యక్షురాలు బాలమణి, కోశాధికారి నర్సమ్మ, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా, మండల నాయకులు మల్లేశం, రాజు, రవి, శంకర్, బాబు, లాలు, శంకర్, శేఖర్,నాగరాజు, మహేందర్, నరసింహులు, కిష్టప్ప, లక్ష్మి, శోభ, తదితరులు పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం లేదు



రోజుకు పది గంటలు కష్టపడుతున్నాం. ఏ పండగైనా మాకు మాత్రం సెలువులు ఉండవు. ప్రతీరోజు పారిశుధ్య పనులు చేస్తున్నా పనికి తగిన వేతనం అందడంలేదు.

– లచ్చమ్మ, పెద్దశంకరంపేట


ప్రభుత్వం స్పందించాలి



కరోనా సమయంలోనూ మా ప్రాణాలు ఫణంగా పెట్టి కాల్వలు, వీధులు శుభ్రం చేశాం. ఏళ్ల తరబడి పని చేస్తున్నా మొక్కుబడిగా వేతనం ఇస్తున్నారు. పెరిగిన ధరలకు ఏమాత్రం సరిపోవడం లేదు. ప్రభుత్వం స్పందించి వేతనం పెంచాలి.

– శోభ, మనోహరాబాద్

డిమాండ్లు నెరవేర్చాలి



సమస్యల పరిష్కారం కోసం 22 రోజులుగా ఆందోళన చేస్తున్నాం. అయినా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయం. మా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు ఆందోళన చేస్తాం.

– రాములు, నిజాంపేట

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న యువకుడు మృతి


అక్షయ్(ఫైల్)

రాయపోలు(దుబ్బాక): చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని లింగారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బూర్గుల అక్షయ్ (24) తన తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయపడేవాడు. చెప్తే వినడం లేదని, పని చేసుకోవాలని ఈనెల 15న తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అక్షయ్ అనాజీపూర్ చెరువు కట్ట వద్దకు వెళ్లి పురుగు మందు తాగి తన స్నేహితుడు వినీత్‌కు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే అక్కడికి వెళ్లిన వినీత్ అతడిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడు. ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి శంకర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం


శ్రీకాంత్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం పోచారం గ్రామానికి చెందిన మారుతి కుమారుడు శ్రీకాంత్ (21) బుధవారం రాత్రి పోచారం సర్వీస్ రోడ్డు మీదుగా ముత్తంగి వైపు తన బైక్‌పై వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసు కున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా బాలుడు..

పటాన్‌చెరు: రోడ్డు దాటుతున్న బాలుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈసంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేశ్వర్‌రావు కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన మదన్‌లాల్ కుటుంబ సభ్యులతో కలసి మూడు నెలల క్రితం పటాన్‌చెరు మండలం రుద్రారం సమీపంలో రోడ్డు పక్కన టేబుల్స్, కుర్చీలు, గొడుగులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం ఉదయం మదన్‌లాల్ కుమారుడు మోను (15) పట్నం హైవే రెస్టారెంట్ ఎదుట రోడ్డు దాటుతుండగా అదే సమయంలో సంగారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అడుగుకో గుంత..

అధ్వానంగా రాజీవ్ రహదారి • 105 కిలోమీటర్ల మేర ఇదే దుస్థితి


గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద రాజీవ్ రహదారిపై ఏర్పడిన గుంతలు

గజ్వేల్: ఉత్తర తెలంగాణలో కీలకమైన రాజీవ్ రహదారి భారీ వర్షాలకు గుంతలమయంగా మారింది. జిల్లాలో 105 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే ప్రమాదకరమైన మలుపులు, పెరిగిన ట్రాఫిక్‌తో ఇబ్బందులు ఎదురవుతుండగా..తాజాగా ఏర్పడిన గుంతలు ప్రమాదాల తీవ్రతను మరింత పెంచుతున్నాయి. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట నుంచి సిద్దిపేట, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల మీదుగా మంచిర్యాల, రామగుండం ప్రాంతం వరకు 207 కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించారు. 13 ఏళ్ల క్రితం ఈ రోడ్డు విస్తరణకు రూ. 1,450 కోట్లకు పైగా వెచ్చించారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో జాతీయ రహదారులను కలిపే ఈ రహదారి అత్యంత కీలకమైంది. ప్రత్యేకించి హైదరాబాద్ అవుటర్ రింగురోడ్డు, వరంగల్ హైవే, నేషనల్ హైవే 44 తదితర హైవేలతో పాటు కొత్తగా నిర్మించనున్న ట్రిపుల్‌ఆర్‌తోనూ ఈ రహదారి అనుసంధానం కానుంది. సిద్దిపేట జిల్లాలో ఈ రహదారి ములుగు మండలం వంటిమామిడి నుంచి బెజ్జంకి మండలం దేవక్కపల్లి వరకు 105 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రహదారి ఇప్పటికే ప్రమాదకరమైన మలుపులతో ప్రమాదాలకు నిలయంగా మారింది. తాజాగా తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది.

చర్యలు చేపట్టకపోతే ప్రమాద ఘంటికలే

ప్రమాదకరమైన మలుపులు, కొన్నేళ్లుగా భారీగా పెరిగిన ట్రాఫిక్‌తో ఇప్పటికే ప్రమాదాలకు నిలయంగా రాజీవ్ రహదారి మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఏర్పడిన గుంతలను పూడ్చకపోతే ప్రమాదాల తీవ్రత పెరగనుంది. ప్రస్తుతం రహదారిపై మలుపులు సరిచేయడం, ఆరు లేన్లుగా విస్తరిస్తేనే భద్రత చేకూరుతుందనే డిమాండ్ ఉంది. ప్రస్తుతం జిల్లాలో సిద్దిపేట బైపాస్, గజ్వేల్‌లోని రింగు రోడ్డు, కుకునూర్‌పల్లి జంక్షన్లు మాత్రమే జాతీయ రహదారి హంగులకు అనువుగా తీర్చిదిద్దారు. కానీ ఇంకా ఎన్నో ప్రదేశాల్లో జంక్షన్లు నిర్మించాల్సి ఉంది. దుద్దెడ, కొడకండ్ల, గౌరారం, ములుగు, రాముపట్ల, ఇబ్రహీంనగర్‌లలో బైపాస్‌ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నా ప్రతిపాదన ముందుకెళ్లలేదు. గతంలో ఈ రహదారిపై సీఎం కేసీఆర్ ఒకటి, రెండుసార్లు హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కానీ రోడ్డు తీరులో ఎలాంటి మార్పు రాలేదు.

గుంతల రోడ్డు.. ప్రమాదకర మలుపులు

వరద ఉధృతితో జిల్లా పరిధిలో ఎక్కడపడితే అక్కడ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ప్రత్యేకించి గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు, గౌరారం, ప్రజ్ఞాపూర్, రిమ్మనగూడ, కొడకండ్ల, దుద్దెడ, పొన్నాల తదితర చోట్ల ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. మలుపులున్న చోటే ఈ గుంతలు ఏర్పడడంతో ప్రమాదాల తీవ్రతను మరింతగా పెంచుతుంది. కొన్ని రోజుల క్రితం గజ్వేల్ మండలం రిమ్మనగూడ మలుపు వద్ద ఏర్పడిన గుంతలతో ఒకేసారి నాలుగు కార్లు, మరో ఆటో ఒకదానికొకటి ఢీకొని రహదారిని ఆనుకొని ఉన్న ఇళ్లవైపు దూసుకొచ్చాయి. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసం కాగా.. తృటిలో ప్రాణనష్టం తప్పింది. మరోవైపు వర్గల్ మండలం గౌరారం వద్ద గురువారం వరద నీరు ముంచెత్తి రాకపోకలకు ఇబ్బంది కలిగింది.

రెండు రోజులు అప్రమత్తంగా ఉండండి

ఉమ్మడి మెదక్ జిల్లా అధికారులతో మంత్రి హరీశ్‌రావు టెలీకాన్ఫరెన్స్


టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డిటౌన్: రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నందున అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశించారు. గురువారం ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ప్రజాప్రతినిధులు, ఇతరశాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వాతావరణశాఖ హెచ్చరిక మేరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో శుక్రవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని.. సమస్య ఉంటే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, చెరువులు, ఓవర్ ఫ్లో అవుతున్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పురాతన భవనాలు, లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పారు. వారం రోజులలోపు డెలివరీ అయ్యే గర్భిణులకు వర్షాలతో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగా దగ్గరలోని ఆస్పత్రికి పంపాలన్నారు. సింగూర్ ప్రాజెక్టులో నీటిమట్టం నిల్వల గురించి నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్‌ను ఆరా తీశారు. ఇంకా 7.23 టీఎంసీల నీరు చేరితే పూర్తి స్థాయిలో నిండుతుందని అజయ్ కుమార్ తెలిపారు. నల్లవాగు ప్రాజెక్ట్, నారింజ వాగులను క్రమం తప్పకుండా తనిఖీ చేసి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అంతిమ పోరాటానికి సిద్ధం కావాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

కొండాపూర్(సంగారెడ్డి): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోసం అంతిమ పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో మాదిగల విశ్వరూప మహాసభ సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ పోరాటానికి మద్దతు పలికిన బీజేపీ ఇచ్చిన మాటకు కట్టుబడాలన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్, రాజకీయ పక్షాలు ఆ దిశగా పార్లమెంట్‌లో ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. ఆగస్టు రెండో వారంలో చలో హైదరాబాద్ పేరుతో లక్షలాది మందితో మాదిగల విశ్వరూపం చూపిస్తామని హెచ్చరించారు. పదేళ్లు దేశంలో అధికారం కలిగి ఉండి కూడా బీజేపీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టకపోవడం సరికాదన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామన్న బీఆర్ఎస్ నిర్లక్ష్యంగా వ్యవహరించిదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్ర, నాయకులు సడాకుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో 'రుతు ప్రేమ'


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సాక్షి, సిద్దిపేట: కర్ణాటకలో 'రుతు ప్రేమ' కార్యక్రమం చేపట్టేందుకు అక్కడి అధికారులు ముందుకు వచ్చారు. అతివల ఆరోగ్యం, అవని రక్షణకు తలపెట్టిన సిద్దిపేట 'రుతుప్రేమ' కార్యక్రమం సత్ఫలితాలుస్తోంది. మంత్రి హరీశ్‌రావు ఆలోచనతో ఈ కార్యక్రమం పురుడు పోసుకుంది. అయితే కర్ణాటకకు చెందిన ఆర్డీపీఆర్ కమిషనర్, యూనిసెఫ్ అధికారులతో బుధవారం రాత్రి సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం పెద్దపల్లి కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ముజామ్మిల్ ఖాన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీంతో కర్ణాటకలో రెండు జిల్లాలు యాద్గిర్, రాయచూర్‌లో రుతుప్రేమ కార్యక్రమం అమలు చేసేందుకు అక్కడి ప్రభుత్వం ముందుకువచ్చింది. అయితే సిద్దిపేట నియోజకవర్గం వ్యాప్తంగా రుతుప్రేమపై మహిళలు, యువతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నారు. పర్యావరణవేత్త డాక్టర్ శాంతి సహకారంతో సీపీ శ్వేత, అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవతో శానిటరీ ప్యాడ్స్ వద్దు.. మెన్సువేల్ కప్స్ ముద్దు నినాదంతో జనాల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తున్నారు.. ఇప్పటివరకు సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో 14 వార్డులు, నియోజకవర్గ పరిధిలో 57 గ్రామాల్లో అవగాహన కల్పించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నగదు, నగలు అపహరణ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

హవేళీఘనపూర్: గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడి నగదు, నగలు అపహరించారు. ఈఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రమైన హవేళీఘనపూర్‌కు చెందిన ఒంటరి లక్ష్మారెడ్డి మెదక్ పట్టణ శివారులోని కలెక్టరేట్ వద్ద దుకాణం నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే ఇంటికి తాళాలు వేసి వెళ్లాడు. కూలీ డబ్బుల కోసం ఇంట్లో బీరువా తెరిచి చూడగా రూ. 5 వేల నగదుతో పాటు నాలుగున్నర తులాల బంగారం కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వేసిన తాళాలు వేసినట్లుగానే ఉండగా.. దొంగతనం ఎలా జరిగిందనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సంఘటనా స్థలాన్ని క్లూస్‌టీంతో ఆధారాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

రోహిత్‌కు సాయం

సాక్షి ఎఫెక్ట్

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మీనగర్‌కు చెందిన సుభాష్, మంజుల కుమారుడు రోహిత్ (27) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బ్రెయిన్ ఆపరేషన్ చేయించేందుకు రూ. 8 లక్షలు అవుతాయని వైద్యులు చెప్పగా.. తగిన స్తోమత లేకపోవడంతో తన కుమారుడిని ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకున్నారు. దీంతో బుధవారం సాక్షిలో 'మాకొడుకును బతికించరూ' పేరిట కథనం ప్రచురితం కాగా రోహిత్‌కు ఆపరేషన్ చేయించేందుకు దాతలు ముందుకు వచ్చారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రూ.1.20 లక్షలు అందించారు. మరో రూ. 3 లక్షలు అయితే తన కుమారుడికి వైద్యులు ఆపరేషన్ చేస్తారని.. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని రోహిత్ తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం


మనిషా కుమారి


మహ్మద్ జావిద్(ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైన సంఘటన మండలంలోని మల్కాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా పులహర గ్రామానికి చెందిన సత్యకుమారి, శత్రుధన్ ముఖియా భార్యాభర్తలు. మండలంలోని మల్కాపూర్‌లో ఆరు నెలలుగా గది అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. సత్యకుమారి చెల్లెలు మనిషా కుమారి (11) రెండు నెలల క్రితం అక్క వద్దకు వచ్చి ఉంటుంది. ఈనెల 25న తెల్లవారుజామున మనిషా కుమారి ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికకు బీహారీ, హిందీ భాషలు మాత్రమే వస్తాయని.. ఆచూకీ తెలిసినవారు 8712656752, 8712656730, 9177515983 ఫోన్ నంబర్లకు లేదా 100కు డయల్ చేసి సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో

పటాన్‌చెరు టౌన్: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ రామ్‌మోహన్ కథనం ప్రకారం.. పట్టణంలోని చైతన్య కాలనీకి చెందిన మహ్మద్ జావిద్ ఆటోడ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 24వ తేదీన తన ఆటో తీసుకొని ఉదయం వెళ్లి సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి చేరుకున్నాడు. ఇంటి ఎదుట ఆటోను నిలిపి కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో జావిద్ భార్య సఫియా పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం: ఒకరి అరెస్ట్


నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

రామాయంపేట, వెల్దుర్తి(మెదక్): వెల్దుర్తి మండలం మాసాయిపేట వద్ద గురువారం ఎక్సైజ్ పోలీసులు వ్యక్తి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ జయసుధ వివరాలు వెల్లడించారు. రూట్‌వాచ్‌లో భాగంగా తాము గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద ఉండగా బైక్‌పై వెళ్తున్న రవి కుమార్‌ను ఆపి తనిఖీ చేశామన్నారు. అతడి వద్ద 105 గ్రాముల గంజాయి లభించిందని తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి బైక్‌ను సీజ్ చేసినట్టు చెప్పారు. ఎవరైనా గంజాయి తరలించినా, దగ్గర ఉంచుకున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చేర్యాల చెరువులో భారీ చేపలు



కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణ సమీపంలోని పెద్ద చెరువు అలుగు పారుతోంది. దీంతో చెరువులోని చేపలు అలుగు నీటి ద్వారా బయటకు వస్తున్నాయి. గురువారం భారీ చేప బయటకు రావడంతో యువకులు దానిని పట్టుకున్నారు. దాని బరువు 13 కిలోలు ఉందని వారు చెప్పారు. – చేర్యాల(సిద్దిపేట)

వాగు దాటలేక..

ట్రాక్టర్‌లో అంతిమయాత్ర


మృతదేహాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని తాడూరు గ్రామానికి చెందిన గిర్క పోశయ్య (80) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన శ్మశానవాటిక వాగు ఒడ్డున ఉండడం.. వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో వాగు దాటలేక మృతదేహాన్ని ట్రాక్టర్‌లో గ్రామం వెలుపల నుంచి పక్క గ్రామం మీదుగా జాతీయ రహదారి వెంబడి శ్మశానవాటికకు తెచ్చి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

30 మందికి వాంతులు, విరేచనాలు


దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

దుబ్బాకరూరల్: మండలంలోని బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ, దుంపలపల్లి, నర్లెంగడ్డ గ్రామాలకు చెందిన 30 మంది వాంతులు, విరేచనాలతో గురువారం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. మూడు రోజులుగా ఒక్కరిద్దరికి వాంతులు, విరేచనాలు కాగా మరుసటి రోజు మరింత మందికి అయ్యాయి. దీంతో భయందోళనకు గురై ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమంగా మారడంతో కొందరిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు కలుషిత నీరు తాగడం వల్లనా? లేక మరేదైనా కారణం ఉందా అని విచారణ చేస్తున్నారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లి కల్లు దుకాణం నుంచి నర్లెంగడ్డ, పద్మశాలిగడ్డ, బల్వంతాపూర్ గ్రామాలకు కల్లు సరఫరా అవుతుంది. కల్లు తాగడం వల్ల వాంతులు, విరేచనాలు అవుతున్నాయనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బాధితులను ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

ఆశ చూపి.. అందిన కాడికి దండుకొని

దొంగ బాబా చేతిలో మోసపోయిన బాధితులు


ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

చేగుంట(తూప్రాన్): బాబా చేతిలో మోసపోయి డబ్బులు పోగొట్టుకున్నామని ఖమ్మం జిల్లా లచ్చగూడ గ్రామానికి చెందిన షేక్ ఖాసీం కుటుంబ సభ్యులు గురువారం చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మక్కరాజీపేటకు చెందిన బగల్ దర్గా వ్యవస్థాపకుడు నయ్యర్ ఘోరీ ఆరోగ్యం బాగు చేస్తానని తమ గ్రామానికి వచ్చాడని.. ఇంట్లో గుప్త నిధులు ఉండడంతో కుటుంబ సభ్యులు అనారోగ్యం బారిన పడుతున్నారని నమ్మించాడని తెలిపారు. పొలం అమ్మితే అంతా బాగు చేస్తానని చెప్పగా ఐదెకరాలు అమ్మేసినట్టు చెప్పారు. పొలం అమ్మిన డబ్బులు రూ. కోటి 30 లక్షలు నయ్యర్ బాబా తీసుకొని తన కొడుకు షేక్ నవాబుకు హైదరాబాద్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని, అక్కడే ఇల్లు కూడా ఇస్తానని నమ్మబలికి కొన్ని నెలలుగా తప్పించుకుంటున్నాడని వాపోయారు. తమకు జరిగిన అన్యాయంపై గ్రామస్తులు, మైనార్టీ కమిటీ సభ్యులకు వివరించారు. బాధితులకు అండగా ఉంటామని గ్రామస్తులు హామీ ఇవ్వగా.. పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ హామీ ఇచ్చారు.

ముగ్గురిని మింగిన చెరువులు

ఉమ్మడి జిల్లాలో ప్రమాదవశాత్తు చెరువులో పడి ముగ్గురు మృతిచెందారు. చెరువులోకి వెళ్లిన గేదెలను ఒడ్డుకు చేర్చబోయి ఒకరు, చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృత్యువాత పడ్డారు.


కృష్ణ మృతదేహం


రాము మృతదేహం

చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి

హవేళీఘనపూర్: చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన హవేళీఘనపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హవేళీఘనపూర్‌కు చెందిన కడమంచి మల్లమ్మ, రాజయ్య పెద్ద కుమారుడు నర్సింలు (20) చేపల కోసం సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి తిరిగి వల తీసుకొని వస్తున్న క్రమంలో కాలుకు చిక్కుకొని నీట మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని ఎస్ఐ శేఖర్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

ఆర్అండ్ఆర్ కాలనీలో..

గజ్వేల్‌రూరల్: చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్అండ్ఆర్ కాలనీలోని వేములఘాట్‌కు చెందిన పేట రాములు (21) గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి చెరువులో మునిగి మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన స్థానికులు చెరువులో నుంచి రాము మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం రాము మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ నరేష్ తెలిపారు. అధికారులు చెరువు చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని సర్పంచ్ సిద్దిపేట బాలయ్య విజ్ఞప్తి చేశారు.

గేదెలు మేపేందుకు వెళ్లి..

కంది(సంగారెడ్డి): గేదెలు మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి రైతు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని చిద్రుప్పలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై రాజేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శివగల్ల కృష్ణ (32) బుధవారం గేదెలను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామంలోని పెద్ద చెరువులోకి గేదెలు వెళ్లాయి. దీంతో వాటిని పైకి తీసుకొచ్చేందుకు చెరువులోకి దిగిన కృష్ణ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఆచూకీ కోసం రాత్రి వరకు వెతికినా ఫలితం లేకుండా పోయింది. గురువారం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు జరపగా కృష్ణ మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.